
సాక్షి నంద్యాల

సోమవారం, 17, జూలై, 2023



మంత్రాలయంలో భక్తుల రద్దీ

మంత్రాలయం: ప్రముఖ అధ్యాత్మిక కేంద్రమైన మంత్రాలయంలో ఆదివారం భక్తుల రద్దీ కనిపించింది. రాఘవేంద్రుల మూలబృందావన దర్శనానికి గంటకు పైగా సమయం పట్టింది.



5,893 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

హాలహర్వి: కర్ణాటకలోని తుంగభద్రం డ్యాంకు ఆదివారం సాయంత్రం నాటికి 5,893 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రస్తుతం డ్యాంలో 9.461 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబామల్లికార్జున స్వామి వార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. పూజాకార్యక్రమాల్లో ఈఓ ఎస్ లవన్న, అర్చకులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఈ నెలలో మూడు సంక్షేమ పథకాలు

కర్నూలు(అగ్రికల్చర్): జూలై నెలలో గ్రామీణాభివృద్ధి సంస్థ, వైఎస్ఆర్ క్రాంతి పథం (డీఆర్‌డీఏ-వైకేపీ), చేనేత జౌళిశాఖలకు సంబంధించి మూడు సంక్షేమ పథకాలు అమలు కానున్నాయి. ఈ పథకాలకు సంబంధించి నగదును లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జమ చేయనున్నారు. డీఆర్‌డీఏ-వైకేపీకి సంబంధించి జగనన్న తోడు కింద చిరువ్యాపారులకు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలపై వడ్డీ రీయింబర్స్‌మెంటు చేసే కార్యక్రమాన్ని ఈ నెల 18న ప్రారంభించేందుకు రంగం సిద్ధమైంది. ఈ నెల 21న వైఎస్ఆర్ నేతన్న నేస్తం కింద చేనేతకారుల కుటుంబాలకు నెలకు రూ.2000 ప్రకారం ఏడాదికి రూ.24వేలు చెల్లించే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతోంది. డీఆర్‌డీఏ-వైకేపీకి సంబంధించి ఈ నెల 26న స్వయం సహాయక సంఘాల బ్యాంకు ఖాతాలకు వైఎస్ఆర్ సున్నా వడ్డీ రీ ఎంబర్స్‌మెంట్ చేయనున్నారు.

రాఘవేంద్ర స్వామికి నూతన వెండి రథం



వెండి రథంపై కలశ పూజ చేస్తున్న పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామికి నూతన వెండి రథాన్ని తయారు చేయించారు. ఇందుకు 280 కిలోల వెండిని వినియోగించారు. పాత వెండి రథం దెబ్బతినడంతో శ్రీమఠం అధికారులు ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. ఆదివారం శ్రీ మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు చేతుల మీదుగా నూతన వెండి రథాన్ని ప్రారంభించారు. మఠం మేనేజర్లు శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, జోనల్ మేనేజర్ శ్రీపతి ఆచార్, ధార్మిక సహాయక అధికారులు బిందుస్వామి, వ్యాసరాజాచార్ పాల్గొన్నారు.

హైవేపై హెల్మెట్ తప్పనిసరి

- ఎస్పీ రఘువీర్‌రెడ్డి



బొమ్మలసత్రం: హైవే మీద బైక్‌పై ప్రయాణం చేసే వారు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, లేకుంటే చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం ఎస్పీ తన కార్యాలయంలో జిల్లా పోలీసు అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వాహన ప్రమాదాలు రోజురోజుకు అధికమవుతున్న తరుణంలో నిబంధనలు తప్పని సరిగా అమలు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సోమవారం నుంచి హైవేపై ప్రయాణం చేసే ప్రతి ద్విచక్ర వాహన దారుడు హెల్మెట్‌ను తప్పని సరిగా ధరించాలన్నారు.

గ్రామ స్వరాజ్యం.. రిజిస్ట్రేషన్ల వికాసం..



గోవిందపల్లెలో మొదటి రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభిస్తున్న శిరివెళ్ల సబ్ రిజిస్ట్రార్ (ఫైల్)

- గ్రామ సచివాలయాల్లో ప్రారంభమైన రిజిస్ట్రేషన్ సేవలు
- ఉన్న ఊర్లోనే స్థిరాస్తి క్రయవిక్రయాలకు శ్రీకారం
- చలానా, డాక్యుమెంట్లు రాయడం, ఫీజు చెల్లింపులు అన్ని అక్కడే
- జిల్లాలో తొలి విడత 10 సచివాలయాల ఎంపిక
- జాయింట్ సబ్ రిజిస్ట్రార్ – 3గా సచివాలయ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్లు



కానాలపల్లెలో రిజిస్ట్రేషన్ చేయించుకుని పత్రాలు అందుకుంటున్న దృశ్యం

ఏడు దశాబ్దాల కాలంలో ఎన్నడూ చూడని అభివృద్ధి ఆవిష్కృతమవుతోంది. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని పూర్తి స్థాయిలో సాకారం చేసే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వేగంగా అడుగులు వేస్తున్నారు. సచివాలయాల ఏర్పాటుతో గ్రామ పాలన స్వరూపమే మారిపోయింది. వలంటీర్ల వ్యవస్థతో ప్రజల ముంగిట్లోకే సంక్షేమ పథకాలు చేరుతున్నాయి. ఈ క్రమంలో సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ల అమలుకు శ్రీకారం చుట్టడంతో పల్లెవాసుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. – ఆళ్లగడ్డ

ఆస్తుల క్రయవిక్రయాలు ఒక ఎత్తైతే.. వాటిని రిజిస్ట్రేషన్ చేయించుకోవడం మరో ఎత్తు. ముందుగా డాక్యుమెంట్ రైటర్లను సంప్రదించి వారితో మాట్లాడి వారు రమ్మన్న రోజు అమ్మినవారు, కొనుగోలు చేసిన వారు, సాక్షులు ఇలా కనీసం 10 మందికి తగ్గకుండా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం దగ్గరకు చేరుకుని వారు అడిగినంత (స్టాంపులు రాసినందుకు, చలానా కట్టినందుకు, అదనపు ఫీజు) మొత్తం ఇస్తే గానీ సకాలంలో పని పూర్తవదు. లేదంటే తప్పులంటూ జాప్యం చేస్తారనేది వాస్తవం. అవినీతిలో ఎవరి వాటా వారిదనేదీ బహిరంగ విషయమే. ఈ క్రమంలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతికి చెక్ పెట్టడంతో పాటు క్రయ, విక్రయ దారుల ఇబ్బందులు తొలగించే విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉన్న ఊర్లోనే రిజిస్ట్రేషన్లకు శ్రీకారం చుట్టింది. మొదటి విడతగా గతనెల 15వ తేదీ నుంచి జిల్లాలో 10 గ్రామ సచివాలయాల్లోనే ఈ సేవలను ప్రారంభించింది. జిల్లా వ్యాప్తంగా 29 మండలాల పరిధిలో మొత్తం 516 గ్రామ, వార్డు సచివాలయాలు సబ్ రిజిస్టర్ కార్యాలయాలుగా అందుబాటులోకి రానున్నాయి. ఆస్తుల క్రయ విక్రయాలు, డాక్యుమెంటేషన్, వివాహ రిజిస్ట్రేషన్లు, ఈసీ, ఆర్ఎస్ఆర్ తదితర సేవలు సచివాలయాల్లోనే అందనున్నాయి. నెట్‌వర్క్, స్కానింగ్, వెబ్‌క్యామ్, వేలిముద్రలు సేకరించడం తదితర అంశాలపై క్షుణ్ణంగా శిక్షణ కూడా పూర్తి చేసుకున్నారు. ఇక మీదట జాయింట్ సబ్ రిజిస్ట్రార్ – 3 గా సచివాలయ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్లు వ్యవహరించనున్నారు. జిల్లాలో మొదటగా మూడు నెలల క్రితం నంద్యాల మండలం బిళ్లలాపురం గ్రామ సచివాలయాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేశారు. అక్కడ సేవలు విజయవంతం కావడంతో అంచెలంచలుగా జిల్లాలో 10 సచివాలయాలకు రిజిస్ట్రేషన్ సేవలు విస్తరించారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి స్థాయిలో విస్తరించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

సొంతూరులోనే రిజిస్ట్రేషన్..



చిత్రంలో రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు అందుకుంటున్న (టీ షర్టు వేసుకున్న వ్యక్తి) చిలకల అమరనాథ్‌రెడ్డిది గోస్పాడు మండలం నాగులవరం గ్రామ పంచాయతీ ఆమ్లేట్ గ్రామం నెహ్రూనగరం. తన తండ్రి చిలకల వెంగళరెడ్డితో రూ 1.46 లక్షలతో ఆస్తిని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు 40 కి.మీ దూరంలో ఉన్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం దగ్గరకు వెళ్లగా అక్కడి రైటర్లు రూ. 10వేల దాకా ఖర్చు అవుతుందని చెప్పారు. ఇంతలో మన సచివాలయంలోనే రిజిస్ట్రేషన్ చేస్తున్నారని వలంటీర్ చెప్పడంతో వెళ్లి అడగ్గా రూ.6,610 ఫీజు తీసుకుని వెంటనే రిజిస్ట్రేషన్ చేశారని అమర్‌నాథరెడ్డి ఆనంద పడుతున్నాడు.

రిజిస్ట్రేషన్ సేవలు ప్రారంభమైన సచివాలయాలు..

మండలం	గ్రామ సచివాలయం
గోస్పాడు	నాగులవరం, కానాలపల్లె
బేతంచెర్ల	అంబాపురం
నంద్యాల	బిల్లలాపురం
పాణ్యం	ఎస్. కొత్తూరు
కొత్తపల్లి	నందికుంట
శిరివెళ్ల	గోవిందపల్లె
ఉయ్యాలవాడ	కొండపల్లె
జూపాడుబంగ్లా	పి.లింగాపురం
నందికొట్కూరు	కొణిదెల

వ్యయప్రయాసలకు చెక్..

రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలంటే రెండు నుంచి మూడు రోజులు కార్యాలయం చుట్టూ తిరిగి అక్కడున్న మధ్యవర్తితో మాట్లాడుకుని వారు సూచించినట్లు అవసరమైన డాక్యుమెంట్లు, గుర్తింపు పత్రాలు తీసుకెళ్లాలి. అన్ని సరిగ్గా ఉన్నా ఏదో ఒక సమస్యతో మరుసటి రోజుకి వాయిదా పడుతోంది. వీటన్నిటికీ భయపడుతున్న పేద, మధ్య తరగతికి చెందిన చాలా మంది అగ్రిమెంట్ డాక్యుమెంట్లతో సరిపెట్టుకుంటున్నారు. తద్వారా డబ్బులు ఇచ్చి కొనుగోలు చేసినా, భాగ పరిష్కారాల్లో పంచుకున్నా, దాన విక్రయాలు ఇచ్చినా భూములపై హక్కులు పొందలేక పోతున్నా రు. వీటన్నిటికి ఫుల్ స్టాప్ పెట్టేలా అన్ని రకాల రిజిస్ట్రేషన్ సేవలు చెంతనే ఉన్న సచివాలయాల్లోనే జరిగేలా చర్యలు చేపట్టడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అర గంటలో పూర్తి

చిత్రంలో రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు అందుకుంటున్న (తెల్లగళ్ల చొక్కా వేసుకున్న వ్యక్తి) రమేష్ స్వగ్రామం శిరివెళ్ల మండలం గోవిందపల్లె. అదే గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డి, వెంకటలక్ష్మమ్మలతో 2.5 సెంట్లు ఇంటి స్థలాన్ని రమేష్ కొనుగోలు చేశాడు. విక్రయదారులు శిరివెళ్ల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం దగ్గరకు వచ్చి రిజిస్టర్ చేయించాలంటే విక్రయించిన ఇద్దరుతో పాటు కొనుగోలు చేసిన వారు, సాక్షులు అందరూ కలిసి వెళ్లాల్సి వచ్చేది. అంతలో అదే ఊరిలోని సచివాలయంలోనే రిజిస్ట్రేషన్ చేస్తున్నారని తెలియడంతో వెళ్లి సంప్రదించగా అంతా అరగంటలోనే రిజిస్ట్రేషన్ చేయడంతో ఎంతో వ్యయ ప్రయాసలు తప్పాయని రమేష్ హర్షం వ్యక్తం చేస్తున్నాడు.



వందల ఏళ్లైనా పేరు మారకుండా..

ఎప్పుడో బ్రిటీష్ పాలనలో చేసిన సర్వేనే ఇప్పటికీ ఆధారం. దీంతో భూముల క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లు గందరగోళంగా మారాయి. ఫలితంగా గ్రామాల్లో కక్షలు, కార్పణ్యాలు పెరిగి ఘర్షణలకు దిగుతూ హత్యలు చేసుకునే స్థాయికి పోతున్నారు. ఇకపై ఈ పరిస్థితులు ఉండవు. సర్వే నంబర్లలో ఇక మీదట సబ్‌డివిజన్‌లు ఉండవు. ఒకరి భూమిని మరొకరు కబ్జా చేసే పరిస్థితి ఉండదు. సదరు భూమి క్రయ విక్రయాలు జరగకుండా వందల ఏళ్లయినా ఒకే యజమాని పేరుమీదనే ఉంటుంది.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



మాట్లాడుతున్న ప్రధాన సీనియర్ శాస్త్రవేత్త ధనలక్ష్మి

బనగానపల్లెరూరల్: వ్యవసాయంలో రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ప్రధాన సీనియర్ శాస్త్రవేత్త ధనలక్ష్మి సూచించారు. ఆదివారం మండలంలోని యాగంటిపల్లె గ్రామ సమీపంలో ఉన్న కేవీకేలో భారతీయ వ్యసాయ పరిశోధన మండలి(ఐసీఏఆర్) వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ధనలక్ష్మి మాట్లాడుతూ ఐసీఏఆర్ వ్యవసాయ రంగంలో ఎనలేని సేవలందిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రపంచ దేశాలతో పోల్చుకుంటే పంటల ఉత్పత్తుల్లో ముందంజలో ఉన్నప్పటికీ ఉత్పాదకతలో వెనుకబడి ఉన్నామన్నారు. ఉత్పాదకత పెంచేందుకు మేలైన యాజమాన్య పద్ధతులతో పాటు నూతన వంగడాలను వినియోగించాలని సూచించారు. ఈ సందర్భంగా కేవీకేలో అందజేస్తున్న నూతన సాంకేతికతలైన విత్తనాలు, జీవన క్రిమినాసినులు, వానపాములు, ఎరువులు, బేనిషాన్ రకపు అంటుకట్టిన మామిడి మొక్కలు, కిచెన్ గార్డెన్ విత్తనాలు తదితర వాటిని ప్రదర్శనగా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు రమణయ్య, సుధాకర్, బాలరాజు, కృష్ణమూర్తి, ఆదినారాయణ, రవిగౌడ్, లక్ష్మీప్రియ, ఏఓ సురేష్‌కుమార్, రిటైర్డ్ ఏడీఏ విశ్వనాథ్‌రెడ్డి, రైతులు, డీలర్లు పాల్గొన్నారు.

ఒక మోస్తరు వర్షాలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి జిల్లాలోని వివిధ మండలాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు కర్నూలు జిల్లా మొత్తంగా సగటున 7.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. కర్నూలు అర్బన్‌లో 29.2, కర్నూలు రూరల్‌లో 27.2, నందవరంలో 23.4, కల్లూరులో 16.4, సి.బెళగల్‌లో 15.2, కోసిగిలో 13.4, ఎమ్మిగనూరులో 12.8, మంత్రాలయంలో 12.2, గూడూరులో 11.4, కోడుమూరులో 9.4 మి.మీ. ప్రకారం వర్షాలు కురిశాయి. నంద్యాల జిల్లాలోని 15 మండలాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. మిడుతూరులో 16.2, రుద్రవరంలో 10.8, శిరివెళ్లలో 10.6, ఆళ్లగడ్డలో 8.3, పాణ్యంలో 8.2 మి.మీ. ప్రకారం వర్షాలు కురిశాయి. జిల్లా మొత్తంగా సగటున 2.9 మి.మీ. వర్షపాతం నమోదైంది. రానున్న మూడు, నాలుగు రోజుల్లో పలు మండలాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు.

సకాలంలో సేవలందించి..



కోవెలకుంట్ల మండలం వల్లంపాడు గ్రామానికి చెందిన ఈ ఫొటోలోని మహిళ పేరు సౌజన్య. డిగ్రీ వరకు విద్యనభ్యసించి నాలుగేళ్ల నుంచి గ్రామ వలంటీర్‌గా పనిచేస్తోంది. భర్త దినకర్ కిరణాషాపు నిర్వహిస్తూ ఇద్దరు పిల్లలను చదివించుకుంటున్నారు. ప్రజలకు తనవంతు సేవ చేయాలన్న ఉద్దేశంతో రూ.5 వేల గౌరవ వేతనంతో తనకు కేటాయించిన 50 కుటుంబాలకు సేవలందిస్తోంది. కరోనా కాలంలో సైతం ప్రాణాలకు తెగించి అండగా నిలిచింది. ఈడిగ తిరుపతయ్యకు కరోనా పాజిటివ్ వచ్చింది. దగ్గు, జలుబు, జ్వరం తదితర లక్షణాలను ఫీవర్ సర్వే ద్వారా ప్రాథమిక దశలోనే గుర్తించింది. వైద్యులకు సమాచారాన్ని చేరవేసి సకాలంలో వైద్య సేవలందించేందుకు కృషి చేసింది.

కుటుంబ సభ్యులు దగ్గరకు రాని పరిస్థితి



2020లో కరోనా రావడంతో కుటుంబ సభ్యులు సైతం దగ్గరకు వచ్చేందుకు భయపడేవారు. వలంటీర్ సౌజన్య అన్ని విధాలా సహాయ, సహకారాలు అందించింది. మందులు, కూరగాయలు, నిత్యావసర సరుకులు ఇంటి వద్దకు తీసుకొచ్చి ఇచ్చింది. ప్రాథమిక దశలోనే వైద్య సేవలు అందటంతో ప్రాణాలతో బయటపడ్డాను. ఆమె సేవలు ఎన్నటికీ మరిచిపోలేను.

– తిరుపతయ్య, కోవెలకుంట్ల

శ్రీశైలంలో భక్తుల రద్దీ

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మహాక్షేత్రానికి భక్తులు పోటెత్తారు. శివునికి అత్యంత ప్రీతికరమైన వారం కావడంతో సోమవారం అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో శ్రీశైలక్షేత్రంలోని పురవీధులు, ఆలయ క్యూలైన్లు కిక్కిరిశాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి వచ్చిన భక్తులు వేకువజామునే పవిత్ర పాతాళగంగలో పుణ్యస్నానాలాచరించి భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లను దర్శించుకున్నారు. క్యూలలో వేచి ఉన్న భక్తులకు ఆలయాధికారులు తాగునీరు, అల్పాహారం అందజేశారు.



భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయ ప్రధాన క్యూలు

నేడు కలెక్టరేట్‌లో 'స్పందన'

నంద్యాల: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమం ఉంటుందని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు స్పందన కార్యక్రమం ప్రారంభమవుతుందని, జిల్లా అధికారులందరూ హాజరు కావాలని సూచించారు. అలాగే జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలోనూ జగనన్నకు చెబుదాం – స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆర్‌యూ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా బాయినేని శ్రీనివాసులు

కర్నూలు (న్యూసిటీ): డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆచార్య బాయినేని శ్రీనివాసులును రాయలసీమ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా నియమించినట్లు వైస్ చాన్సులర్ ఆచార్య ఎ.ఆనందరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం జరిగిన పాలక మండలి ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశామని, సోమవారం ఉదయం 10:30 గంటలకు రాయలసీమ యూనివర్సిటీలో ఆచార్య బాయినేని శ్రీనివాసులు ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టనున్నారని వీసీ తెలిపారు.

మేలు తలపులు.. 'నవ' వెలుగులు

- విద్యుత్ శాఖలో తొమ్మిది రకాల పథకాలు
- మొదటి స్థానంలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్
- సంక్షేమం, వినియోగదారులకు మేలు చేసే పథకాలకు చోటు
- డిస్కంలో గత ఏడాది రూ.5,393కోట్ల ఖర్చు
- 19.95 లక్షల మందికి చేకూరిన ప్రయోజనం



కర్నూలు(రాజ్‌విహార్): రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన 'నవరత్నాలు' సరికొత్త చరిత్రను సృష్టించాయి. ఇందులోని పథకాలను చూసి ఇతర రాష్ట్రాలు సైతం ఆకర్షితులవుతున్నాయి. అయితే నవరత్నాల్లాంటి పథకాలను విద్యుత్ శాఖ కూడా ఆచరణలోకి తెచ్చింది. దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ తొమ్మిది రాకాల పథకాలు తెచ్చి, పేదలకు లబ్ధి చేకూర్చుతోంది. ఇందు కోసం రూ. వేల కోట్లు ఖర్చు చేస్తోంది.

ప్రజలకు అర్థమయ్యేలా పథకాలు

విద్యుత్ శాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అర్థమయ్యేలా రూపొందించారు. ఉచిత విద్యుత్, పేదలందరికీ ఇళ్లు, ఆక్వా రైతులకు సబ్సిడీ, ఎస్సీ, ఎస్టీలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, క్షౌర శాలలు, లాండ్రీలకు నెలకు 150 యూనిట్లు, ధోబీ ఘాట్లకు ఉచిత విద్యుత్, మోస్ట్ బ్యాక్ వర్డ్ క్లాస్‌కు 100 యూనిట్ల ఉచిత విద్యుత్, స్వర్ణకారులకు, చేనేత మగ్గాలకు, పవర్ లూమ్స్ నెలకు 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, పవర్ ఫర్ ఆల్, నిరంతర విద్యుత్, సరఫరాలో అంతరాయ నిర్మూలన, సమస్య పరిష్కారం కోసం గ్రామ/ వార్డు సచివాలయాల్లో ఎనర్జీ అసిస్టెంట్లు (జూనియర్ లైన్‌మెన్ గ్రేడ్-2) నియామకం వంటివి చేర్చారు.

ఏడాదిలో రూ.5,393 కోట్ల ఖర్చు

విద్యుత్ శాఖ తెచ్చిన పథకాల ద్వారా భారీగా నిధులు ఖర్చు చేస్తున్నారు. దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఏడాదిలోనే రూ.5,393.48కోట్లు ఖర్చు చేసింది. దీని ద్వారా 19,95,871 మందికి మేలు చేకూరింది. గత నాలుగేళ్లలో పరిశీలిస్తే దీని విలువ నాలుగు రెట్లు ఉంటుందని అంచనా. కేవలం విద్యుత్ సంస్థ ద్వారా ఇన్ని కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం.. పేదల మంచి చేసేందుకు ఇతర శాఖల ద్వారా చేసే మేలు అంచనాకు అందనిది.

రైతులకే మొదటి స్థానం

వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం రైతుల అవసరాలు తీర్చేందుకు ఎలాంటి కొరత లేకుండా నిధులు ఇస్తోంది. ఇదే తరహాలో విద్యుత్ పంపిణీ సంస్థ వ్యవసాయానికి ఉచిత విద్యుత్ పథకాన్ని చేర్చింది. అన్ని స్కీముల కంటే అత్యధిక మంది లబ్ధిపొందుతున్న పథకం ఇదే. ఈ స్కీంకే ప్రభుత్వం కూడా అధిక నిధులు ఖర్చు చేస్తోంది. మరో ముఖ్యమైన పథకం ఎస్సీ, ఎస్టీలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్. ఇందులో లబ్ధిదారులు అధిక శాతం రెండో స్థానంలో ఉన్నారు.

డిస్కంలోని విద్యుత్ పథకాలు, ఏడాదిలో చేసిన ఖర్చుల వివరాలు

విద్యుత్ పథకాల పేర్లు	లబ్ధిదారుల సంఖ్య	చేసిన ఖర్చు
వ్యవసాయానికి పగలే 9గంటల విద్యుత్ సరఫరా	11,42,773	రూ.4,670.10 కోట్లు
పేదలందరికీ ఇళ్లు	60,047	రూ.195.69 కోట్లు
ఆక్వా రైతుల సబ్సిడీ	11,021	రూ.80.92 కోట్లు
ఎస్సీ, ఎస్టీలకు నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్	7,62,167	రూ.235.77 కోట్లు
క్షౌర శాలలు, లాండ్రీలకు నెలకు 150 యూనిట్లు వరకు, ధోబీ ఘాట్లకు ఉచిత విద్యుత్	4,724	రూ.2.12 కోట్లు
ఎంబీసీలకు 100 యూనిట్ల ఉచిత విద్యుత్	1,446	రూ.0.26 లక్షలు
స్వర్ణకారులకు, చేనేత మగ్గాలకు, పవర్ లూమ్స్ నెలకు 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్	10,639	రూ.9.44 కోట్లు
పవర్ ఫర్ ఆల్, 24*7 నిరంతర విద్యుత్ సరఫరా కోసం		రూ.107.26 కోట్లు
గ్రామ/వార్డు సచివాలయ స్థాయిలో విద్యుత్ సేవల కోసం ఎనర్జీ అసిస్టెంట్లు (జూనియర్ లైన్‌మెన్ గ్రేడ్-2) నియామకం	3,015	రూ.115.78 కోట్లు
మొత్తం తొమ్మిది పథకాలు	19,95,871	రూ.5,393.48కోట్లు

ప్రభుత్వ లక్ష్యాల మేరకే పథకాలు



రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలు ఎంతో చరిత్ర సృష్టించాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెచ్చిన ఈ పథకాలు ప్రతి గడపకు మేలు చేకూర్చుతున్నాయి. ఆయన ఆదేశాల మేరకు ఇదే తరహాలో మా సంస్థ పరిధిలో అమలవుతున్న పథకాలను తొమ్మిది విభాగాలు విభజించి ఆచరణలో పెట్టాం. ఏ స్కీం కింద ఎంత మంది లబ్ధిదారులు ఉన్నారు? ప్రభుత్వం ఎన్ని కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోంది? అనే వివరాలను ప్రజలకు స్పష్టంగా తెలిసేలా రూపొందించాం. కేవలం ఒక్క ఏడాదిలోనే రూ.5,393కోట్లకు పైగా ఖర్చు చేయగా 19.95 లక్షల మందికి ప్రజలకు మేలు జరిగింది.

–కె. సంతోషరావు, సీఎండీ, ఎస్పీడీసీఎల్

క్లుప్తంగా

కుక్కల దాడిలో బాలుడికి తీవ్రగాయాలు



బాలుడికి చికిత్స చేస్తున్న వైద్యుడు

ఆలూరు రూరల్: బహిర్భూమికి వెళ్లిన అభిషేక్ అనే బాలుడిపై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. హొళగుంద మండలం ఎల్లార్తి గ్రామానికి చెందిన మృత్యుంజయ కుమారుడు అభిషేక్ ఆదివారం ఉదయం ఇంటి పక్కన బహిర్భూమికి వెళ్లాడు. ఐదు వీధి కుక్కలు ఒక్కసారిగా బాలుడిపై దాడి చేసి విచక్షణారహితంగా కాటువేశాయి. కుక్కల నుంచి తప్పించుకునే ప్రయత్నంలో కింద పడి బాలుడి తలకు గాయాలయ్యాయి. గమనించిన తల్లిదండ్రులు అబ్బాయిని ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చారు. డాక్టర్లు చికిత్స అందించారు. ప్రస్తుతం బాబు ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యుడు వాహీద్ వెల్లడించారు.

వ్యక్తి బలవన్మరణం



మృతిచెందిన ఖాసీం(ఫైల్)

ఆలూరు రూరల్: చెట్టుకు ఉరివేసుకుని ఖాసీం (30) అనే వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. హొళగుంద మండలం ఎల్లార్తి గ్రామానికి చెందిన ఖాసీం మటన్ షాపు పెట్టుకుని జీవనం సాగించేవాడు. కొంత కాలంగా మద్యాన్నికి బానిసై..డబ్బులు లేక మనస్తాపం చెంది ఆదివారం ఉదయం గ్రామంలోని చెరువు వద్ద ఉన్న చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి వెళ్లి ఖాసీం మృతదేహాన్ని ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించారు.మృతుడు ఖాసీంకు భార్య దిల్‌షాద్ ఉంది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హొళగుంద ఎస్‌ఐ శ్రీనివాసులు విలేకరులకు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

గూడూరు రూరల్: మండల పరిధిలోని కె.నాగలాపురంలో సతీష్(27) అనే యువకుడు ఆదివారం తెల్లవారుజామున ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ యువకుడు ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో పనిచేస్తున్నాడు. నెలన్నర కిందట కర్నూలులోని బంధువుల అమ్మాయితో నిశ్చితార్థం జరిగింది. మరో నెల రోజుల్లో వివాహం జరిపించేందుకు పెద్దలు నిర్ణయించారు. అయితే అనుకోకుండా సతీష్ తెల్లవారుజామున ఇంటిలోని గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న దృశ్యాన్ని చూసిన కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. సతీష్ ఆత్మహత్యకు సంబంధించి ఎలాంటి కారణాలు తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయలేదు.

అదృష్టం 'వరి'ంచేలా!

- గతేడాది కలిసొచ్చిన వరి సాగు
- ఎకరాకు 40 బస్తాలకు పైనే దిగుబడులు
- మద్దతు ధరతో లాభాల పంట
- జిల్లాలో ఈ ఏడాది 70,900 హెక్టార్లలో సాగు లక్ష్యం
- సాగుకు ముందే క్వింటాకు రూ.2,203 మద్దతు ధర
- సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగే ఆస్కారం
- కర్నూలు, నంద్యాల సోనా సాగుపై ఆసక్తి
- నారుమడులు సిద్ధం



కోవెలకుంట్ల సమీపంలో వరినారుమడి

కోవెలకుంట్ల: జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ వరి సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. గత ఏడాది వరిసాగు అన్ని విధాలా కలిసి రావడం, ఆశించిన స్థాయిలో దిగుబడులు వచ్చి మార్కెట్‌లో మంచి ధర పలకడంతో ఈ సీజన్‌లో రెట్టింపు ఉత్సాహంతో సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ ఖరీఫ్‌లో జిల్లాలోని 29 మండలాల పరిధిలోని బోర్లు, బావులు, కుందూనది, పాలేరు, కుందర వాగు, ఎస్సార్బీసీ, కేసీ కెనాల్, తదితర నీటి ఆధారంగా 70,900 హెక్టార్లలో కర్నూలు, నంద్యాల, షుగర్ లెస్, 555 రకాలకు చెందిన వరిని సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇందులో స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని అవుకు మండలంలో 4,201 హెక్టార్లలో, కోవెలకుంట్ల మండలంలో 1,489, సంజామల మండలంలో 1,176, దొర్నిపాడు మండలంలో 1,252, ఉయ్యాలవాడ మండలంలో 1,009, కొలిమిగుండ్ల మండలంలో 426 హెక్టార్లలో వరి సాగు సాధారణ విస్తీర్ణం. ఆయా ప్రాంతాల్లో ఇప్పటికే నారు మడులు సిద్ధం చేసుకుని, ఈ నెలాఖరు నుంచి వరినాట్లు వేసేందుకు అన్నదాతలు ఎదురు చూస్తున్నారు.

ఎకరాకు 40 బస్తాలకు పైనే దిగుబడులు

గత ఏడాది జిల్లాలోని ఆయా మండలాల పరిధిలో 67,890 హెక్టార్లలో వరిని సాగు చేశారు. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, కలుపు నివారణ, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.33 వేలు వెచ్చించారు. సాగునీటి వనరులు పుష్కలంగా ఉండటం వాతావరణం అనుకూలంగా మారటంతో ఎకరాకు 40 బస్తాలకు పైనే దిగుబడులు లభించాయి. ప్రభుత్వం వరిసాగుకు ముందే మద్దతు ధర ప్రకటించింది. గ్రేడ్–1 రకానికి రూ.2,060, గ్రేడ్–2కు రూ.2,040 మద్దతు ధర ప్రకటించగా రైతులకు పెట్టుబడులు పోను ఆదాయం చేకూరింది. ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యాన్ని విక్రయించడంతో దళారుల బెడద తప్పి రైతులు లాభాలు గడించారు. గతేడాది వరిసాగు కలిసి రావడం, ఈ ఏడాది సాగుకు అనుకూలంగా మారటంతో జిల్లాలో సాధారణ విస్తీర్ణానికి మించి సాగయ్యే అవకాశాలు ఉన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

నియోజకవర్గాల వారీగా వరి సాగు వివరాలు

నియోజకవర్గం	సాధారణ విస్తీర్ణం (హెక్టార్లలో)
ఆళ్లగడ్డ	18,882
శ్రీశైలం	18,669
బనగానపల్లె	12,908
నంద్యాల	9,768
నందికొట్కూరు	4,108
డోన్	275
పాణ్యం (గడివేముల, పాణ్యం)	5,690

కర్నూలు, నంద్యాల సోనాపై ఆసక్తి

జిల్లాలో ఈ ఏడాది రైతులు కర్నూలు, నంద్యాల సోనాపై ఆసక్తి చూపుతున్నారు. ఆయా రకాల్లో గతేడాది మంచి దిగుబడులు రావడంతో తిరిగి వాటినే సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. దీనికి తోడు ప్రభుత్వం గత ఏడాదితో పోలిస్తే వరికి మద్దతు ధర పెంచింది. గ్రేడ్–1 రకానికి రూ.2,203, గ్రేడ్–2 రకానికి రూ.2,183 మద్దతు ధర ప్రకటించింది. క్వింటాకు గతంతో పోలిస్తే రూ.143 పెరగడంతో వరిసాగు విస్తీర్ణం గణనీయంగా పెరగనుంది. వర్షాలు అనుకూలంగా మారి సాగునీరు పుష్కలంగా అందుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మూడు ఎకరాల్లో వరిసాగు



గత ఏడాది ఖరీఫ్‌లో రెండు ఎకరాల్లో వరి సాగు చేశాను. వాతావరణం అనుకూలించి ఎకరాకు 40 బస్తాల దిగుబడులు వచ్చింది. ఈ ఏడాది మూడు ఎకరాల్లో వరి సాగుకు నారుమడి సిద్ధం చేసుకున్నాను. వరిమడిలో దమ్ము చేసి రసాయన ఎరువులు తెచ్చి పెట్టుకున్నాను. మరో పదిహేను రోజుల్లో వరినాట్లు వేసేందుకు సమాయత్తమవుతున్నాను.

– మోహన్, రైతు, వల్లంపాడు, కోవెలకుంట్ల మండలం

సూచనలు ఇవ్వాలి



ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేసే రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు ఎప్పటికప్పుడూ సూచనలు, సలహాలు అందజేయాలి. నాకున్న మూడు ఎకరాల పొలంతోపాటు మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాను. ఎకరన్నర పొలంలో వరి సాగుకు మడిని సిద్ధం చేసుకున్నాను.

– సుబ్బరాయుడు, రైతు, కోవెలకుంట్ల

రసాయన ఎరువులు వాడొద్దు



వరిసాగులో రైతులు విరివిగా రసాయన ఎరువులు వినియోగిస్తున్నారు. కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లోని ఆయా మండలాల్లో ఈ ఏడాది 9వేల హెక్టార్లలో వరి సాగు లక్ష్యం. ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేసే రైతులు అవసరమైన మేరకే యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు వినియోగించాలి. వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించి అధిక దిగుబడులు సాధించాలి

– నిరంజన్, ఏఓ, కోవెలకుంట్ల

నాణ్యతతో సబ్‌స్టేషన్ల నిర్మాణం

కర్నూలు(రాజ్‌విహార్): సబ్ స్టేషన్ల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం. ఉమాపతి అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విద్యుత్ భవన్ నుంచి కింది స్థాయి అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో లో ఓల్టేజీ సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వం కొత్తగా తొమ్మిది విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరు చేసిందన్నారు. ఇందులో గ్రామీణ ప్రాంతాల కోసం ఐదు కాగా పట్టణాల్లో నిర్మించే జగనన్న కాలనీలు, టిడ్కో గృహ అవసరాల కోసం కేటాయించారన్నారు. వీటి నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడరాదని సూచించారు. వీటిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నిర్ణిత గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు.

లైసెన్స్ లేకుండా మట్టి తరలిస్తే చర్యలు

కర్నూలు (న్యూసిటీ): లైసెన్స్ లేకుండా మట్టి, కంకరను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఆదివారం అధికారులు సెలవుల్లో ఉంటారని తెలుసుకొని ఆ రోజు అక్రమార్కులు మట్టి, కంకరను తలిస్తున్నారని పేర్కొన్నారు. అధికారులు తనిఖీలు చేస్తున్నప్పుడు కొందరు తిరగబడుతున్నారని, వారిపై కేసులు నమోదు చేయించి పోలీసులకు అప్పగిస్తామని తెలిపారు. అక్రమంగా మట్టి, కంకరు తరలిస్తే జరిమానాలు విధించి జైలుకు పంపుతామని హెచ్చరించారు.

పేకాట స్థావరంపై దాడి

- ముగ్గురి అరెస్టు.. రూ.20,380 స్వాధీనం

కృష్ణగిరి: మండల పరిధిలోని గుడెంపాడు గ్రామ శివారులోని సుంకులమ్మ గుడి సమీపంలో ఉన్న ఈదుల వద్ద పేకాట ఆడుతున్న స్థావరంపై ఆదివారం పోలీసులు దాడులు చేశారు. ఈ దాడిలో కోయిలకొండకు చెందిన ఈడిగ రామలింగం, కంబాలపాడుకు చెందిన రామకృష్ణతోపాటు మరో వ్యక్తిని అదుపులోకి తీసుకుని వీరి వద్ద నుంచి రూ.20,380లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ఆర్. సురేష్ తెలిపారు. మండలంలో ఎక్కడైనా మట్కా, పేకాట ఆడుతున్నట్లు తెలిస్తే తమకు సమాచారం అందిస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

మిద్దె కూలి ఒకరు దుర్మరణం

- మరో ముగ్గురికి తీవ్రగాయాలు



చందూనాయక్ (ఫైల్)

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని ఉమ్మాయిపల్లె తండాలో ఇంటి పైకప్పు కూలడంతో ఒకరు మృతి చెందగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. తండాకు చెందిన మూడే చందూనాయక్(55) ఇంటి వరండాలో దంతెలు దెబ్బతినడంతో ఆదివారం మరమ్మతులకు ఉపక్రమించాడు. చందూ నాయక్‌తోపాటు సోదరుడు లక్ష్మానాయక్, కూలీలు రాజునాయక్, అబ్దులాపురానికి చెందిన వడ్డె నగేష్‌తో కలిసి జాకీ ఏర్పాటు చేసి పనులు చేస్తుండగా జాకీ విరిగిపోయి పైకప్పు కూలిపోయింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నలుగురినీ చికిత్స నిమిత్తం అనంతపురం జిల్లా తాడిపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చందూనాయక్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

ఉద్యోగం పేరుతో టోకరా



మోసం చేశారని ఆరోపిస్తున్న బాధితులు



నకిలీ ఐడీ కార్డు

డోన్ టౌన్: రైల్వే శాఖలో ఉద్యోగం ఇప్పిస్తామని, జాబ్‌లో జాయిన్ అనన తరువాతే డబ్బు ఇవ్వాలని నమ్మబలికి ఫేక్ ఐడీతో పాటు నెల జీతం బాధితుని ఖాతాలో జమ చేసి అనంతరం రూ.16 లక్షలు కాజేసిన ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాలు.. మండలంలోని వెంకటనాయునిపల్లె గ్రామానికి చెందిన బలరామయ్య, జయలక్ష్మి దంపతుల కుమారుడు రామ్మోహన్‌కు ఏడాది క్రితం అమర్‌నాథ్, ఆర్మీ రామయ్య అనే వ్యక్తులు పరిచయమయ్యారు. రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తామని జాబ్‌లో చేరి జీతం డ్రా చేసిన తరువాత ఒప్పందం ప్రకారం రూ.16 లక్షలు ఇవ్వాలని చెప్పడంతో రామ్మోహన్ అంగీకరించాడు. రైల్వేలో ఉద్యోగం వచ్చినట్లు ఫేక్ ఐడీ క్రియేట్ చేసి వారణాసిలో శిక్షణ ఇస్తున్నట్లు అక్కడ ఒక అకాడమీలో చేర్పించారు. నెల అనంతరం వీరే రామ్మోహ్మన్ బ్యాంక్ ఖాతాలో డబ్బు జమ చేసి జీతం పడినట్లు నాటక మాడారు. ఇది నిజమని తెలిసి తల్లిదండ్రులు ఇంట్లో ఉన్న బంగారు, కొంత భూమి విక్రయించి రూ.16 లక్షలు ఇచ్చారు. రెండో నెల తరువాత మోసపోయినట్లు గుర్తించి స్వగ్రామానికి తిరిగి వచ్చిన రామ్మోహన్ తల్లిదండ్రులకు విషయం చెప్పగా అమర్‌నాథ్, ఆర్మీ రామయ్యలను నిలదీశారు. దీనికి డబ్బు తమ వద్ద లేదని నాలుగు సెంట్ల స్థలం తీసుకోమని అగ్రిమెంట్ రాసిచ్చారు. అయితే రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వకుండా కాలయాపన చేస్తుండటంతో ఆదివారం బాధితులు పట్టణ పోలీసుకు ఫిర్యాదు చేశారు.

న్యాయం కోసం భర్త ఇంటి ఎదుట దీక్ష



భర్త వినోద్‌కుమార్ ఇంటి ముందు పిల్లలతో దీక్ష చేస్తున్న రజియాబీ

ఎమ్మిగనూరురూరల్: తనను ప్రేమించి.. పెళ్లి చేసుకొని.. ఇద్దరు పిల్లలు జన్మించాక వదిలేయడం అన్యాయమని, తనకు న్యాయం చేయాలంటూ రజియాబీ అనే మహిళ ఆదివారం భర్త వినోద్‌కుమార్ ఇంటి ఎదుట బైఠాయించింది. వివరాలు.. కడివెళ్ల గ్రామానికి చెందిన గొల్ల వినోద్‌కుమార్ తమ ఇంటి సమీపంలో నివాసముంటున్న రజియాబీనీ ప్రేమించాడు. 13 సంవత్సరాల క్రితం ముంబైకి తీసుకెళ్లి పెళ్లి చేసుకొని కాపురం పెట్టారు. ఎనిమిదేళ్ల క్రితం కాపురాన్ని ఎమ్మిగనూరుకు మార్చాడు. వీరికి గొల్ల తేజ(7), గొల్ల అంజలి(5) ఇద్దరు సంతానం ఉన్నారు. ఎమ్మిగనూరు నుంచి స్వగ్రామమైన కడివెళ్లకు వెళ్లి వస్తూ ఉండేవాడు. ఈ నేపథ్యంలో ముస్లిం యువతిని పెళ్లి చేసుకున్నావని, కులం వాళ్ల నుంచి మాట వస్తోందని వినోద్‌కుమారుకు కుటుంబసభ్యులు చెబుతూ వచ్చారు. దీంతో కొన్ని నెలల నుంచి రజియాబీకి దూరంగా ఉండటం ప్రారంభించాడు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు గుట్టుచప్పుడు కాకుండా నెల క్రితం కర్ణాటకలోని తమ బంధువుల అమ్మాయితో వినోద్‌కుమార్‌కు రహస్యంగా పెళ్లి జరిపించారు. విషయం తెలుసుకున్న రజియాబీ రూరల్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో ఈ నెల 5న వినోద్‌కుమార్‌తో పాటు మరో ఐదుగురు కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేశారు. అయితే తనకు న్యాయం చేసేంత వరకు భర్త ఇంటి ముందు నుంచి కదలబోనని కడివెళ్లలో రజియాబీ ఆదివారం దీక్షకు దిగింది. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు అక్కడికి చేరుకుని సర్దిచెప్పారు. అయినా ఆమె వినుకోలేదు. తన భర్త ఇంట్లోకి పిలుచుకోవాలని లేదంటే బయటే కూర్చుంటానని తేల్చిచెప్పారు. వినోద్ కుటుంబ సభ్యులతో పోలీసులు చర్చిస్తున్నారు.

కురుబలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి

మదనపల్లె: రాయలసీమలో అధికసంఖ్యలో ఉన్న కురబలకు అన్ని పార్టీలు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని కురుబసంఘం రాష్ట్ర నాయకులు, రిటైర్డ్ జడ్జి కృష్ణప్ప తెలిపారు. ఆదివారం పట్టణంలోని అయోధ్యనగర్ శ్రీరామ కల్యాణ మండపంలో రాష్ట్ర కురుబల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. కార్యక్రమానికి కర్నూలు, అనంతపురం, ఉమ్మడి చిత్తూరు, వైఎస్సార్ జిల్లాలకు చెందిన కురబకుల ప్రతినిధులు, నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రిటైర్డ్ జడ్జి కృష్ణప్ప మాట్లాడుతూ.. కురుబలలో ఐక్యత లేని కారణంగా తీవ్రంగా నష్టపోవడం జరుగుతోందన్నారు. అందరూ ఐకమత్యంతో ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. తమకు రాజకీయ పార్టీలతో సంబంధం లేదని, సామాజికంగా, ఆర్థికంగా పైకి వచ్చేందుకు రాజ్యాంగం కల్పించిన హక్కులు తమకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. రాయలసీమలోని నాలుగు ఉమ్మడి జిల్లాల్లో ఉన్న 36 నియోజకవర్గాల్లో కుప్పం నుంచి కర్నూలు వరకు 30లక్షలకు పైగా కురుబలు ఎన్నికల్లో గెలుపు, ఓటములు నిర్దేశించేస్థాయిలో కీలకంగా ఉన్నామన్నారు. కురబ కార్పొరేషన్ డైరెక్టర్ దండురామాంజులు, నాయకులు బెల్లేరెడ్డిప్రసాద్ మాట్లాడుతూ కనకదాస విగ్రహాలను ప్రతినియోజకవర్గంలో ఏర్పాటుచేసేందుకు స్థలాలను కేటాయించాలన్నారు. మాదాసి, మాదారి కురుబలకు రెవెన్యూఅధికారులు సర్టిఫికెట్లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కురుబ సంఘం నాయకులు ఆరెళ్ల జయప్ప, బోరంపల్లె అంజనేయులు, ఎన్.ఈశ్వరయ్య, నాగభూషణం, దొనస్వామి, బుల్లే లింగప్రసాద్, కనుగొండ్లరాజేష్, సామకోటి ఆదినారాయణ, జెడ్పీటీసీ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

గోరుకల్లు జలాశయంలో మృతదేహం లభ్యం

పాణ్యం: మండల పరిధిలోని గోరుకల్లు జలాశయంలో మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ పి. అశోక్ ఆదివారం తెలిపారు. తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మునుగు మండలం కొంగాయగుడెంకు చెందిన శివాజీ, అరుణకుమారి దంపతులు గోరుకల్లు జలాశయంలో చేపలకు కాపలాగా ఉంటున్నారు. వీరి కుమారులైన ఇమ్మానియేలు(26), రవి.. తల్లిదండ్రులను కలవడానికి నెలక్రితం గోరుకల్లు జలాశయం వద్దకు వచ్చారు. ఈనెల 14వ తేదీన సిమెంట్ దిమ్మెలపై కుర్చొని ఉండగా గాలిధాటికి జారి ఇమ్మానియేలు జలాశయంలో పడిపోయాడు. ఆదివారం ఉదయం మృతదేహం నీటిపై తేలడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య లక్ష్మీ, కుమార్తె ఉన్నారు. భార్య లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైకులు ఢీకొని ఒకరు మృతి

- మరొకరికి గాయాలు



మృతిచెందిన మల్లికార్జున

బొమ్మలసత్రం: నంద్యాల శివారులోని వైఎస్సార్ నగర్ సమీపంలో ఆదివారం వేకువజామున రెండు బైకులు ఢీకొని ఎద్దుల మల్లికార్జున(30) మృతిచెందాడు. ట్రాఫిక్ ఎస్‌ఐ నజీర్ తెలిపిన వివరాలు.. పులిమద్ది గ్రామానికి చెందిన మల్లికార్జున ఓ దినపత్రికలో ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. నంద్యాల ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్న పేపర్లను తీసుకెళ్లేందుకు తెల్లవారుజామున బైక్‌పై బయలు దేరాడు. అదే సమయంలో నంద్యాలకు చెందిన మరో దినపత్రిక ఏజెంట్ మదార్‌వలి బైక్‌పై పేపర్లతో వెళ్తుండగా వైఎస్సార్ నగర్ సమీపంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో మల్లికార్జున తలకు బలమైన గాయం కావటంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతిచెందాడు. మదార్‌వలి పరిస్థితి విషమంగా ఉండటంతో స్థానికులు నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.



రమణీయం.. సంగమేశ్వర సోయగం



ఇటీవల కురిసిన వర్షాలకు భవనాశి నది జలకళ సంతరించుకుంది. ఈ నది ఒంపు సొంపులతో సంగమేశ్వరం సమీపంలోని కృష్ణమ్మలో కలసి శ్రీశైలం వెనుక జలాలలో ఇమిడిపోతోంది. ఓ వైపు భవనాశి నది, మరోవైపు కృష్ణమ్మ.. వీటికి తోడుగా పచ్చదనం మధ్యలో అతి ప్రాచీనమైన సంగమేశ్వరాలయం ఎంతో చూడముచ్చగా ఉంది. ఆలయంలోని వేపదారు శివలింగాన్ని దర్శించుకునేందుకు, కృష్ణమ్మ, నల్లమల అందాలను చూసేందుకు భక్తులు, సందర్శకులు వస్తున్నారు. భవనాశి నది.. కృష్ణమ్మను సమీపిస్తున్నప్పుడు నాగుపాము ఆకారంలో మారడం కనువిందు చేస్తోంది. – కొత్తపల్లి